## క్లుప్తంగా

### ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన



వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో నూతన నిర్మించిన వినాయకుని ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పెద్దాడ దుర్గయ్యశాస్త్రికి సత్కారం



దుర్గయ్యశాస్త్రిని సత్కరిస్తున్న పండితులు

పెదపూడి: మండలంలోని పెద్దాడ గ్రామానికి చెందిన ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్యశాస్త్రిని తిరుమల తిరుపతి దేవస్థానంలో ఘనంగా సత్కరించారు. తిరుపతిలో సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి గుల్లపల్లి కృష్ణ మనోహర ఆచార్య, ఆగమ వైఖానస శైవ స్మార్త పండితుల సమక్షంలో ఆగమద్రమని అనే బిరుదు దుర్గయ్యశాస్త్రికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దుర్గయ్యశాస్త్రికి ప్రశంసా పత్రం అందించి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పండితులు వీర ఉమామహేశ్వర శాస్త్రి, వీర దుర్గయ్య శాస్త్రి, పన్నీర్ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్ల రాజీనామా



రంగంపేటలో రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శ్రీరామరాజుకు అందజేస్తున్న వలంటీర్లు

రంగంపేట: మండలంలోని పెదరాయవరంలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు బుధవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.శ్రీరామ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు వలంటీర్లను పదే పదే అవమానించడమే కాకుండా పింఛన్ల పంపిణీకి దూరం చేయడంతో మనస్తాపం చెంది ఉద్యోగాలకు రాజీనామా చేశామని చెప్పారు.

### 130 మందికి దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు



శిబిరంలో విద్యార్థిని పరిశీలిస్తున్న సుభాషిణి

మధురపూడి: ప్రత్యేక అవసరాల గల పిల్లలు(సీడబ్ల్యూఎస్ఎన్) ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా జిల్లా పీడీ ఎస్. సుభాషిణి అన్నారు. బుధవారం కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన వైకల్య నిర్ధారణ పరీక్ష శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటి వరకూ మూడు శిబిరాలు నిర్వహించామన్నారు. నాలుగో శిబిరం కోరుకొండలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీనికి కోరుకొండ, రాజానగరం, సీతానగరం, గోకవరం, రంగంపేట, మండలాలకు చెందిన వినికిడి, దృశ్య లోపాలతో పాటు, ఆర్థోపెడిక్ సమస్యలున్న 130 విద్యార్థులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈ కో–ఆర్డినేటర్ కనకబాబు, ఎంఈఓ కుశలవ దొర పాల్గొన్నారు.

### 'పారిజాత పర్వం' సినిమా ప్రమోషన్

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో వనమాలి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన 'పారిజాత పర్వం' చిత్ర బృందం బుధవారం సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ కళాశాలకు వచ్చిన హీరో చైతన్యరావు, హీరోయిన్ శ్రద్ధాదాస్‌లు కొద్దిసేపు విద్యార్థినులతో మమేకమై చిత్రంలోని ప్రత్యేకతను తెలియజేశారు. ఈనెల 19న విడుదలయ్యే ఈ సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్‌లోనే చూడాలని కోరారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రద్ధాదాస్ కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థినులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడారు.

# వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో ప్రతిపక్షాల నుంచి వైఎస్సార్ సీపీలోకి పలువురు కార్యకర్తలు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలుచేసిన సంక్షేమ పథకాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేపట్టిన అభివృద్ధ పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జక్కంపూడి రాజా ఏ గ్రామానికి వెళ్లిన ఆయన సమక్షంలో పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్న నేపథ్యంలో మండలంలోని చక్రద్వారబంధంలో సుమారు 80 మంది టీడీపీ, జనసేనలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారం చేస్తూ తమ గ్రామానికి వచ్చిన జక్కంపూడి రాజా వెంట అడుగులో అడులేస్తూ, జక్కంపూడికి జేజేలు పలికారు. పార్టీలోకి వచ్చిన వారందరికీ రాజా పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉండే ఈ గ్రామం 2019 ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతు పలికింది. ఆపై అరకొరగా మిగిలిన వారు సైతం ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్న నేపథ్యంలో ఈ గ్రామం నేడు జక్కంపూడి అడ్డాగా మారింది.

**భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలి**

పార్టీ చేరిన వారందరికీ స్వాగతం పలికిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో భారీ మెజార్టీతో విజయం సాధించే దిశగా మీరంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మీ చేరికల ప్రభావం ఏ మేరకు ఉంటుందో ప్రత్యర్థులకు దిమ్మతిరిగేలా చూపాలన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పని చేసిన వారికి ఇంటా, బయటా కూడా మంచి గుర్తింపు ఉంటుందనే విషయాన్ని మరువవొద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, వాద్రేవు శ్రీనివాస్‌కుమార్, వేమగిరి కృష్ణ, నాగవరపు త్రిమూర్తులు, భానుశంకర్, నీలపాల శివరామకృష్ణ, ఉప్పులూరి రమేష్, ఎస్.తాతబ్బాయి, మార్గాని శ్రీను, ఎస్.రమణ, కురుమళ్ల బాబి, నల్లమిల్లి వీరభద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నతోనే రాష్ట్రానికి మేలు



ఆరికరేవులలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మన రాష్ట్రానికి మేలు జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని ఆరికరేవుల గ్రామంలో ఇంటింటి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, డాక్టర్ గుడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రలో నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతి సాధించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో గడప గడపకూ అభివృద్ధి ఫలాలు అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు తొండాపు గాంధీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురునాగు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఏసురాజు, ఎంపీటీసీ కొర్ల చక్రరావు, కొర్ల నాగు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఫైనాన్స్ ఆఫీసర్‌గా సుదీర్ఘ కాలంపాటు విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన కొత్తపూడి శ్రీనివాసరావును బుధవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌లతోపాటు పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు శ్రీనివాసరావు సేవలను ప్రశంసించారు. 1987లో జూనియర్ గణకుడిగా ఉద్యోగంలో చేరి, సమర్థవంతమైన సేవలందిస్తూ పదోన్నతులు పొందుతూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు.


## మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలి



విధి విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓ ఎం.మాధురి

అనపర్తి: పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఆర్‌ఓ కార్యాలయంలో బుధవారం ఎన్నికల నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలకు హోమ్ ఓటింగ్ విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాధురి మాట్లాడుతూ 85 ఏళ్ల వయసున్న వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగుల హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఫారం–12(డీ)పై సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్‌కు అభ్యర్థన పత్రాలు తీసుకుని, ఎంతమంది హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నారో వారి జాబితాను రూపొందించాలని సూచించారు. నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటిని సందర్శించి హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకునే ఓటర్ల నుంచి అంగీకార పత్రం(ఫారం–12డీ)ని తీసుకున్నామని సిబ్బంది తెలిపారు. మొత్తంగా నియోజకవర్గంలో 1,149 మంది 85 ఏళ్ల పైబడిన వారు, 2,675 మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌బాబు పాల్గొన్నారు.

### ఫార్మసీ రంగం అభివృద్ధికి వినతి



రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నల్లమిల్లి ఆదిరెడ్డి

అనపర్తి: ఫార్మసీ రంగం అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డికి ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. బుధవారం నెల్లూరులోని రామచంద్ర కల్యాణ మంటపంలో ఫార్మసీ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల తయారీలో ఫార్మసిస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ చేసిన నిరుద్యోగులకు క్లినికల్ ఫార్మసిస్ట్ కేడర్‌తో ప్రభుత్వాసుపత్రుల్లో ఉద్యోగ అవకాశాలు, మెడికల్ షాపుల్లో ఫార్మసీ యాక్ట్ అమలు తదితర అంశాలపై విజయసాయిరెడ్డికి విన్నవించామన్నారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారని ఆదిరెడ్డి తెలిపారు.

## ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదిద్దాం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ

సీతానగరం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గుర్తు సీలింగ్ ఫ్యాన్‌పై ఓటు వేసి, సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకొద్దామని రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. బుధవారం ఉండేశ్వరపురంలో డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పిలిస్తే వచ్చే ఎమ్మెల్యేగా పేరొందిన జక్కంపూడి రాజాను గెలిపించాలంటూ కోరారు. జగనన్న పారదర్శక పాలనతో రాష్ట్ర సుభిక్షంగా ఉందన్నారు. అటువంటి పాలన కోసం తిరిగి మే నెలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని డాక్టర్ రాజశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, పార్టీ నాయకులు మాకాల సూరిబాబు, పిట్రా శ్రీరంగ నాయకులు, పెనుగుల నాగేశ్వరరావు, గోసాల పాండురాజు, అనాసుల సూరయ్య, రుద్రు బాబురావు, మల్లిన చౌదరి, జొన్నలగడ్డ సత్యనారాయణ, మేమగిరి నాగ మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉండేశ్వరపురం ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

### శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

అనపర్తి: మండలంలోని పొలమూరు రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, వ్యాపారవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వంతెన పరిసరాల్లో ఇసుక తవ్వకాలు జరపొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

- జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వంతెన పరిసర ప్రాంతాల పరిధిలో 500 మీటర్ల దూరం వరకు ఎటువంటి ఇసుక తవ్వకాలు నిర్వహించకూడదని, జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. బుధవారం ఆమె ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. గోదావరి వంతెనలకు 500 మీటర్ల దూరం గుర్తించే ప్రక్రియలో భాగంగా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకునేందుకు టాస్క్ ఫోర్స్ టీమ్ ఎస్ఈబీ, రెవెన్యూ, జల వనరులు, గనులు–భూగర్భ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో బీ1 కేటగిరి కింద 10 ఇసుక రీచులకు పర్యావరణ అనుమతుల కోసం ఆమోదం తెలిపిందన్నారు. ఇసుక డిసిల్టేషన్ అనుమతులు నిర్దిష్ట ఆరు నెలల కాల పరిమితితో కూడిన పరిమాణాన్ని అనుమతులు మంజూరు కోసం రివర్ కంజర్వేటర్ కోసం తగిన ప్రతిపాదనలు కోసం సమావేశంలో తీర్మానించామన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆల్కట్ గార్డెన్స్‌లో మూడు ఇసుక రీచ్‌లను నిలిపివేసినట్టు తెలిపారు. విజ్జేశ్వరంలో జరిగే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా అరికట్టుటకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఫీజబిలిటీ రావలసిన రెండు రీచులు (5 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం) సంబంధిత శాఖల నుంచి అనుమతి పొంది తదుపరి చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. పర్యావరణ అనుమతులు సాధ్యమైనంత వరకు పొంది అన్ని ఇసుక రీచ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ ఎన్.తేజ్ భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ, జిల్లా మైన్స్ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ – ఎస్ఈడీ బాలశంకరరావు, డీడీ భూగర్భ జలాలు వై.శ్రీనివాస్, సెబ్ అదనపు ఎస్పీ వి.సోమశేఖర్, డీటీఓకేవీ కృష్ణారావు, ఇరిగేషన్ ఈఈ రమేష్, పోలీస్, డీపీవో, ఈఈ గోదావరి వాటర్ హెడ్స్, పర్యావరణ, మైన్స్ అధికారులు, ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పనుల వల్ల ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వివిధ ప్రదేశాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగు అధికారులను కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. దానవాయిపేటలో గాంధీపార్కు అభివృద్ధి, సీసీ రోడ్లు, క్వారీ మార్కెట్ వద్ద ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం, లేపాక్షి ఎంపోరియం వద్ద చేపట్టిన జంక్షను అభివృద్ధి, కంబాలచెరువు చెరువు జంక్షను అభివృద్ధి, డ్రైను నిర్మాణం, నాగులచెరువు మార్కెట్ జంక్షను అభివృద్ధి, మెయిన్ రోడ్డు రత్నా పేలస్ వద్ద నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ చేపట్టిన అనేక అభివృద్ధి పనులను ఇప్పటికే పూర్తి చేయగలిగామని మిగిలిన పనులు కూడా అతి తొందరలోనే పూర్తి చేస్తామన్నారు. పనులన్నీ నాణ్యత ప్రమాణాలతో ఉండేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీరు జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషగిరిరావు, మదర్ షా అలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంటు ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



రంగంపేటలో విశాఖ డైరీ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రంగంపేట మండలంలో ఎన్నికల ప్రచారం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక రైస్ మిల్లులు, విశాఖ డైరీతో పాటు జీడి పిక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులను గురువారం ఆయన కలుసుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, వృద్ధులు, యువత ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలకు అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని సంక్షేమం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతుందన్నారు. కులమతాలకు, రాజకీయాలకు తావులేకుండా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి అండగా నిలవాలన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రానికి మంచి చేస్తున్న జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని తమ మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లేటి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు పాల్గొన్నారు.



ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

## శ్రీరామపురంలో జక్కంపూడి గణేష్ ప్రచారం

రాజానగరం: శ్రీరామపురంలో వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ద్వారా చేసిన అభివృద్ధిని వివరిస్తూ, ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజా సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని, అందుకు మీరంతా రాబోయే ఎన్నికలలో 'ఫ్యాన్' గుర్తుకు ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.



శ్రీరామపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జక్కంపూడి గణేష్

## కార్మికులకు జగనన్నే అండ

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండలో ఆటో యూనియన్ కార్మికులతో సమావేశం

మధురపూడి: కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం కోరుకొండ హరే రామ కల్యాణ మండపంలో ఆటో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ఆటో కార్మికుల సంక్షేమానికి పథకాలను అమలుచేసినట్టు తెలిపారు. ఇచ్చిన మాటను నెలబెట్టుకున్న జగనన్నను సీఎం చేయడానికి ప్రతి కార్మికుడు పని చేయాలని కోరారు. గత ప్రభుత్వాలు కార్మికులను మోసం చేశాయని, జగనన్న మాత్రమే వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ వాహన యజమానులు, డ్రైవర్లకు రూ.10వేల చొప్పున కార్మికులకు అందించినట్టు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండలో ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

## వైభవంగా మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



మహాగణపతి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో జక్కంపూడి రాజా, డాక్టర్ రాజశ్రీ దంపతులు



విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చియ్యనగర్‌లో శ్రీక్షిప్ర సంకట హర ఆరోగ్య మహాగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం కాలభైరవ గురుస్వామి వారి సమక్షంలో వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు జక్కంపూడి విజయలక్ష్మి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా, డా.రాజశ్రీ దంపతులతోపాటు, బుచ్చియ్యనగర్‌కు చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా పూజలు, హోమం నిర్వహించారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, జక్కంపూడి కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని, అనివార్య కారణాల వల్ల ఆలయం నిర్మాణంలో జాప్యం ఏర్పడిందన్నారు. తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆశయ సాధనకు అనుగుణంగా జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, ఇతర పెద్దల సహకారంతో ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఈ ఆలయాన్ని ప్రారంభించామన్నారు. ఈ ఆలయ సముదాయంలో భాగంగా కాలభైరవ ఆలయం, గౌరీ శంకర్ల ఆలయం, దత్తాత్రేయుల ఆలయం, శ్రీరామాలయం, దుర్గాలయంతో పాటు నవగ్రహ ఆలయాలను అతి సుందరంగా తీర్చిదిద్దామన్నారు. శ్రీక్షిప్ర సంకట హర ఆరోగ్య మహా గణపతి దేవాలయంలో స్వామి వారికి పూజలు చేస్తే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యం కుదుటపడుతుందని, కోరిన కోరికలు కూడా నెరవేరుతాయన్నారు. ఆలయ ప్రాంగణంలో మహాఅన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో హుక్కుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, బుచయ్య నగర్ పెద్దలు, గ్రామ వాసులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల విధులపై అవగాహన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈబీ పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఏఎస్పీ పి.సోమశేఖర్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 28ఏ ప్రకారం ఎన్నికల నిర్వహణ విధులకు కేటాయించిన అధికారులందరూ ఎన్నికల నిర్వహణ ఉత్తర్వులు వచ్చిన నాటి నుంచి నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ విధి నిర్వహణలో అందరిని సమభావంతో చూడాలన్నారు. ఏ రాజకీయ పార్టీ పక్షాన వ్యవహరించకూడదని తెలిపారు. ఇతరులు ఎవ్వరిని పోలింగ్‌స్టేషన్‌కి 100 మీటర్ల దూరం వరకు అనుమతించకూడదన్నారు. గత ఎన్నికలలో బూత్ ఆక్రమణలు గాని, బూత్‌లలో బెదిరింపులకు పాల్పడిన వారిపై తగిన చర్య తీసుకోవాలన్నారు. మద్యం అక్రమంగా నిలువ చేసిన ప్రదేశాలపై సమాచారం తెలిసిన వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి పై అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల ముందు, తర్వాత నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు.